క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బదావత్ సురేశ్ హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో గత నెల 30 నుంచి ఈ నెల 3వరకు నిర్వ హించిన తెలంగాణ యువ ప్రో కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొన్నారు. పోటీల్లో చక్కని ప్రతిభ చూపి నిజామాబాద్ జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో కీలకపాత్ర పో షించారు. సురేశ్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర విఠల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

పసుపు ఉత్పత్తిదారుల సంఘం సందర్శన



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌లో ఉన్న జేఎంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని గురువారం నాగార్జున ఫర్టిలైజర్స్ లిమిటెడ్ మాజీ ఎండీ రమణారెడ్డి సందర్శించారు. పసుపు ఉత్పత్తిదారుల సంఘం మారుమూల ప్రాంతంలో రైతుల కోసం ఏర్పాటు చేయడం శుభ పరిణామమని అన్నారు. ఈ పరిశ్రమతో పసుపు రైతులకు మేలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పసుపు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ తిరుపతిరెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్ బదిలీ

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ యాదగిరిగౌడ్ బదిలీ అయ్యారు. మూడేళ్ల క్రితం ఇక్కడికి వచ్చిన ఆయన కామారెడ్డి జిల్లాలోని చిన్న మల్లారెడ్డికి బదిలీపై వెళ్తున్నారు. బదిలీ అయిన మేనేజర్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఏఎంసీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, అఖిల్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది క్రాంతి, ప్రణయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నిజామాబాద్ నాగారం: జిల్లా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘాలు గురువారం జిల్లా అధ్యక్షుడు బండారి గంగాధర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వేణు, శాంతయ్య, బాబురావు, గంగాధర్, పెంచాల శ్రీనివాస్, బాలరాజ్, సత్యం, రాంచందర్, కనకయ్య పాల్గొన్నారు.

చేయూత పింఛన్ల కోసం పోరాటం చేస్తాం

నిజామాబాద్ అర్బన్: చేయూత పింఛన్ల కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోదన్నారు. గురువారం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈనెల 8న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 12న అన్ని ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య, సలీం, ప్రవీణ్, రమేశ్, యమున, సత్య తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటిన వలంటీర్లు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 4 సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సైన్స్ కళాశాల భవనం ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు స్రవంతి, స్వప్న, వలంటీర్లు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	109,400	వెండి(కిలో)	1,29,500
22 క్యారెట్స్	101,010	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	48	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	40	80	దోసకాయ	15	30
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	60	110	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	60
వంకాయ	40	80	బీట్‌రూట్	30	60
పాలకూర	50	100	కరివేపాకు	40	80
మెంతికూర	60	110	చామగడ్డ	30	60
కొత్తిమీర	40	80	చిక్కుడుకాయ	60	100
పుదీనా	50	100	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	40	80	-సుభాష్‌నగర్		

ఆధ్యాత్మిక కేంద్రంగా ఇందూరు

- హిందువులు ఐక్యంగా ఉండాలి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మహాగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను సన్మానిస్తున్న హైందవ సేన ఉత్సవ సమితి సభ్యులు

సుభాష్‌నగర్: హిందూ ధర్మ సంస్కృతీ, సాంప్రదాయాల ఐక్యతే దేశ సమైక్యతకు మూలమని, అందులో భాగంగా ఆధ్యాత్మిక కేంద్రంగా ఇందూరు నిలుస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని నగరంలో కొలువుదీరిన గణనాథులను ఎమ్మెల్యే గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. బాలగంగాధర్ తిలక్, ఛత్రపతి శివాజీ మహారాజ్‌ల స్ఫూర్తితో సనాతన హిందూ ధర్మ రక్షణకు యావత్ హిందూ సమాజం ఉత్సవాలను నిర్వహిస్తోందని అన్నారు. హిందువుల ఐక్యత ఈ తొమ్మిది రోజులే కాకుండా భవిష్యత్‌లోనూ హిందూ సమాజానికి, ధర్మానికి ఎలాంటి ఆపద వచ్చినా మనమంతా ఐక్యతతో జయించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు మండపాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, బట్టికారి ఆనంద్, పవన్ ముందాడ, కృష్ణ, సతీశ్ పాల్గొన్నారు.

మహాగణపతి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని బొడ్డెమ్మచెరువు వద్ద ఉన్న మహాగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ చిలుముల భూషణ్‌చారి ఎమ్మెల్యేకు ఆలయ విశిష్టతకు గురించి వివరించారు. ఆలయ అర్చకులు సంజీవ్ శర్మ, కమిటీ సభ్యులు మహిపాల్‌రెడ్డి, అమందు శ్రీనివాస్, రవీందర్‌చారి, డాక్టర్ ఏసీ దాస్, శ్రీనివాస్, శ్రావణ్, భూపాల్, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



డీఈవో, ఉపాధ్యాయులను సన్మానించిన స్నేహ సొసైటీ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: విద్యార్థులకు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని డీఈవో అశోక్ కుమార్ అన్నారు. గురువారం నగరంలోని మారుతినగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ అంధుల, మానసిక దివ్యాంగుల పాఠశాలలో కార్యదర్శి సిద్ధయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణ, ప్రాథమిక దశలో విద్యార్థులకు అందించే బోధన కన్నా దివ్యాంగులకు అందించే బోధన చాలా క్లిష్టమైన విషయమన్నారు. స్నేహ సొసైటీ దివ్యాంగులకు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ మాట్లాడుతూ.. దేవుడు అందరిని తాను చూసుకోలేక అమ్మను సృష్టించాడన్నారు. స్నేహ సొసైటీ ద్వారా మానసిక దివ్యాంగులు జాతీయస్థాయిలో యోగా ద్వారా పేరు తెచ్చుకున్నారని అన్నారు. అనంతరం స్నేహ సొసైటీలో పనిచేసే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఏ జ్యోతి, పి రాజేశ్వరి, డి. సునీత, ఎస్ విమల, సౌందర్య, అంగన్‌వాడీ టీచర్లు ఓంకార్ లక్ష్మి, ఏ స్వాతి, సందీపను స్నేహ సొసైటీ సభ్యులు సన్మానం చేశారు. కార్యక్రమానికి ముందు దివ్యాంగ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండలో..



స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వయంపాలన దినోత్సవంలో భాగంగా 62 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ఉత్తమ బోధనను గావించిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేకులపల్లిలో..



రేకులపల్లిలో నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ధర్పల్లి: మండలంలోని రేకులపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం అంకం నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరం



ధర్పల్లి: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆదేశాల మేరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్, డిచ్‌పల్లి సీఎంసీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ధర్పల్లి మండలం వాడి గ్రామంలో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాడి గ్రామంలోకి భారీ వరద రావడంతో వాటి కారణంగా ప్రజలకు చర్మవ్యాధులు, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విక్రమ్ రెడ్డి, వినోద్ కుమార్ గుప్తా, శ్రీశైలం, రాందాస్, మధుకర్, చక్రపాణి, ప్రతిభ, బీజేపీ నాయకులు మహిపాల్, కర్క గంగారెడ్డి, మోహన్ రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన



జక్రాన్‌పల్లి: మండలంలోని వాణిజ్య శాస్త్రంలో భాగంగా బ్యాంకు సేవలపై అవగాహన కల్పించడానికి ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జక్రాన్‌పల్లి బ్రాంచ్ బ్యాంకుకు తీసుకెళ్లి వారి యొక్క సేవలను అసిస్టెంట్ మేనేజర్ ఆకాశ్ అవగాహన కల్పించారు . కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, అసిస్టెంట్ మేనేజర్ ఆకాష్, కంచర రవికుమార్, నాగేష్ , సౌమ్య,జ్యోస్న, శ్రీకాంత్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

నిజామాబాద్ సిటీ: ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షానికి రైతాంగం వేసుకున్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రైతులకు పంటనష్టం ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య గురువారం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చెరుకు, మొక్కజొన్న, పత్తి, సోయా, పెసరి, మినుములతో పాటు ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దేశెట్టి సాయిరెడ్డి, విఠల్, బి సాయిలు, బాబురావు, వేల్పూర్ గంగారాం, గంగాధర్, కె.గోపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన

నిజామాబాద్ అర్బన్: ప్రైవేట్ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్లపై అవగాహన కార్యక్రమం గురువారం నగరంలోని ప్రెసిడెంట్ హై స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో అశోక్ హాజరై మాట్లాడారు. ప్రతి పాఠశాల ఐదు నామినేషన్లను అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, రిసోర్స్ పర్సనల్ శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



కాలూరులో శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



బోర్గాం(పి)లో వినాయక నిమజ్జన రథయాత్ర



ఘన్‌పూర్‌లో బోలోనాథ్ యూత్ ఆధ్వర్యంలో..

నిజామాబాద్ రూరల్ / డిచ్‌పల్లి/ ధర్పల్లి/ మోపాల్: గణేశ్ నిమజ్జన ఉత్సవాలను ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న ఘననాథుడిని నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో భక్తులు స్థానిక చెరువుల, బావుల్లో నిమజ్జనం చేశారు. కాలురులో నిర్వహించిన గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. డిచ్‌పల్లి, ధర్పల్లి, మోపాల్‌లో గణేశ్ ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పలు మండపాల్లో లడ్డూ వేలం చేపట్టారు.



నర్సింగపూర్ గ్రామంలో..

'సాక్షి' యూనిట్ కార్యాలయంలో..



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని సాక్షి దినపత్రిక నిజామాబాద్ యూనిట్‌లో వినాయకుడు 9 రోజుల పాటు సిబ్బంది పూజలందుకున్నారు. బ్రాంచ్ మేనేజర్ పి.మహేశ్ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సిబ్బంది ఆటపాటలతో, భజన గీతాలు ఆలపిస్తూ వినాయకుడి శోభాయాత్ర నిర్వహించారు. వేడుకల్లో వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద మిగిల్చిన విషాదం



గడ్కోల్ గ్రామానికి చెందిన కమ్మరి లక్ష్మణ్ ఉపాధి కోసం రేకుల షెడ్డు వేసుకొని వెల్డింగ్ షాప్ పెట్టుకొని జీవిస్తున్నాడు. నివాసం కూడా అందులోనే ఉంటున్నాడు. కప్పలవాగు ఉధృతికి రేకుల షెడ్డు అడుగు భాగం పూర్తిగా దెబ్బతింది. వరదతో లోపల ఉన్న బియ్యం, బట్టలు ఇతర సామగ్రి పూర్తిగా తడిచి ముద్దయ్యాయి. ఇనుప గేట్లు, ఇతర వస్తువుల తయారీకి తెచ్చిన సామగ్రి షెడ్డు ముందర ఉంచగా వరదలో కొట్టుకుపోయాయి. దీంతో షెడ్డును ఖాళీ చేసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. లైట్ మిషన్ పెట్టుకోవడానికి గదులు దొరక్క అవస్థలు పడుతున్నాడు.



కొండూర్‌లో పొలాల్లో వేసిన ఇసుక మేటలు

- వేల ఎకరాల్లో పంటలు ధ్వంసం
- అన్నదాతలకు రూ. లక్షల్లో నష్టం



పెద్దవాల్గోట్‌లో నేలవాలిన వరి పంట

సిరికొండ: మండలంలో గత నెల 27న కురిసిన భారీ వర్షం విషాదం మిగిల్చింది. వర్షానికి తోడు ముత్యాల చెరువు తెగిపోవడంతో ఆ వరద గ్రామాలతో పాటు పంటలను ముంచెత్తింది. వేలాది ఎకరాల్లో పంట ధ్వంసమైంది. పంటల ధ్వంసంతో పాటు పొలాల్లో వేసిన ఇసుక మేటలు తొలగించడం లాంటి ఖర్చులతో అన్నదాతలకు రూ. లక్షల్లో నష్టం వాటిల్లింది. వరద ఉధృతికి పంట భూముల రూపురేఖలు మారిపోయాయి. కప్పలవాగు, మధ్యల వాగు, దెయ్యం మడుగు, వాగు, తెల్ల వలుగు వాగు, దొండ్ల వాగు, బైలూర్ వాగు, మొండి వాగుల పక్కన పంట పొలాల్లో ఎటు చూసిన ఇసుక మేటలే దర్శనమిస్తున్నాయి. తూంపల్లి, పాకాల, కొండాపూర్, ముషీర్‌నగర్, గడ్కోల్, తాళ్లరామడుగు, కొండూర్, చిన్నవాల్గోట్, పెద్ద వాల్గోట్, పోత్నూర్, చీమన్‌పల్లి, పందిమడుగు గ్రామాల పరిధిలో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్న, సోయాబీన్ పంటలు తుడిచి పెట్టుకుపోయాయి. కొన్ని గ్రామాల్లో కప్పలవాగు పక్కన ఉన్న భూముల్లో మూడు ఫీట్ల పైన ఇసుక మేటలు వేశాయి. ఆయా గ్రామాల్లో 3540 ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో మొక్కజొన్న, 40 ఎకరాల్లో సోయాబీన్ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. పెద్దవాల్గోట్‌లో జుబేర్ అనే వ్యక్తికి చెందిన రెండు కోళ్లఫారాలు నేలమట్టవడంతో రూ. 30 లక్షల ఆస్తి నష్టం, గడ్కోల్‌లో జమాల్‌కు చెందిన కోళ్ల ఫారం కూలిపోవడంతో రూ. 20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. వర్షాలకు ఆయా గ్రామాల్లో 88 ఇండ్లు కూలిపోయాయి. మరిన్ని శిథిలావస్థకు చేరాయి.

రూ. ఐదు లక్షలు నష్టం



నా ఐదెకరాల పొలంలో కప్పల వాగు ఉధృతికి పూర్తిగా ఇసుక పెట్టింది.పంటను పూర్తిగా కప్పేసింది. ఇసుకను తొలగించాలంటే చాలా ఖర్చవుతుంది. ఐదు ఎకరాల్లో పంట ద్వారా రూ. మూడున్నర లక్షల వరకు ఆదాయం వచ్చేది. పంట దెబ్బతినడంతో ఆదాయంతో పాటు పంట సాగుకు పెట్టిన పెట్టుబడి రాని దుస్థితి నెలకొంది. అంతా కలిపి రూ.ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లింది.

–చెల్లెం నరేశ్‌రెడ్డి, రైతు, కొండూర్

ముత్యాల చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్ అటవీ ప్రాంతంలోని ముత్యాల చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగి పోవడంతో నీటి పారుదల శాఖ అధికారులు చెరువు కట్ట తెగిన ప్రదేశాన్ని గురువారం పరిశీలించారు. ఇరిగేషన్ సీఈ మధుసూదన్‌రావు, ఎస్ఈ రామారావు చెరువు కట్ట పరిస్థితులు, తెగిపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని సీఈ మధుసూదన్ రావు తెలిపారు. ముత్యాల చెరువు నుంచి లక్ష్మి చెరువు వరకు ఉన్న కాలువ భారీ వరద ప్రవాహానికి కొట్టుకుపోవడంతో దాని మరమ్మతులు చేపట్టి లక్ష్మి చెరువును నింపాలని స్థానిక రైతులు ఇరిగేషన్ అధికారులను కోరారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి లక్ష్మి చెరువులోకి నీళ్లు వచ్చేలా పనులు చేపడతామని సీఈ మధుసూదన్ రావు రైతులకు తెలిపారు. డీఈ ప్రేమ్ కుమార్, ఏఈ రాంప్రసాద్, రైతులు ఉన్నారు.

నానో ఎరువుతో అధిక దిగుబడి



ఇందల్వాయి: నానో ఎరువుతో అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ అన్నారు. ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని గురువారం తనిఖీ చేసి రైతులకు నానో ఎరువుపై అవగాహన కల్పించారు. అనంతరం నష్టపోయిన పంటలను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్, రైతులు ఉన్నారు.

ఎమ్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఖలీల్‌వాడీలో ఉన్న ఎమ్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. గురువారం నగరంలోని రియాన్సు హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్‌లో ఆస్పత్రి మేనేజ్‌మెంట్ సుంకె మధు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించగా వైద్యులు సర్ఫరాజ్, దొర బాబు, వెంకట్‌రెడ్డి 150 మంది విద్యార్థులకు ఉచితంగా రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

గణేశునికి 65 రకాల నైవేద్యాలు



నిజామాబాద్ రూరల్: నగరంలోని ఆర్టీసీ కాలనీలో వరసిద్ధి శక్తిమాన్ హనుమాన్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో 65 రకాల నైవేద్యాలను స్వామి వారికి భక్తులు సమర్పించారు. మండలి సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మోపాల్‌లో భగవద్గీతలు అందజేత



మోపాల్: మండల కేంద్రంలో మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు 200 మినీ భగవద్గీతలను గురువారం ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి హిందువు ఇంట్లో భగవద్గీత ఉండాలనే ఏకైక లక్ష్యంతో ఇప్పటి వరకు 7600కు పైగా భగవద్గీతలను అందజేసినట్లు తెలిపారు. అనంతరం యువకులు జ్ఞానేందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

గణేశ్ శోభాయాత్ర రూట్‌మ్యాప్ పరిశీలన

నిజామాబాద్ సిటీ: జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ పర్యటించారు. గురువారం నగరంలోని దుబ్బ నుంచి వినాయక్‌నగర్‌లోని వినాయకుల బావి వరకు సాగే గణేశ్ శోభాయాత్రను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి ఇటీవల కురిసిన వర్షాలకు పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అలాగే అర్సపల్లి నుంచి జానకంపేట మీదుగా బాసర, ఉమ్మెడ వరకు సాగే గణేశ్ నిమజ్జన రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. బాసర, ఉమ్మెడ వద్ద సీసీ కెమెరాలు బిగించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి, డీఈలు ముస్తాక్‌అహ్మద్, రషీద్, సుదర్శన్‌రెడ్డి, ఏఈ పావని తదితరులు ఉన్నారు.

వినాయక మండపంలో అన్నదానం

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని వినాయక ఉత్సవాల్లో జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ పాల్గొన్నారు. గురువారం బొబ్బిలివీధిలో ఏర్పాటు చేసిన శ్రీవరసిద్ధి వినాయక మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గణేశ్ కమిటీ సభ్యులు హరికృష్ణ, లక్కీ, నిఖిలేశ్, నవదీప్, రాజు, అశోక్, సంతోష్ సింగ్, వినీశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని జెండాగల్లీలో ఉన్న మేరు సంఘంలో సంఘ సభ్యుడు దీకొండ సురేందర్ అనే వ్యక్తి తన తల్లి, భార్య జ్ఞాపకార్థంగా మహిళలకు గురువారం చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మేరు సంఘం ప్రధాన కార్యదర్శి కొట్టూరు దేవిదాస్, నగర అధ్యక్షుడు మంతెన దశరథ్, కొట్టూరు అంజయ్య, కొట్టూరు ధర్మపురి, కప్పె రవి, పుట్టకోట పాండు, నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు దుప్పట్లు..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని గంగాస్థాన్ ప్రాంతంలోని వాగు ప్రాంతంలో నివసిస్తున్న వరద బాధితులకు కరీంనగర్ యూట్యూబర్ కాటం విజయలక్ష్మి, ప్రేమ్‌కుమార్ దుప్పట్లను పంపిణీ చేశారు. బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలని వారు కోరారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సరుకులు..

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో వరద బాధితులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సరుకులను గురువారం పంపిణీ చేశారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగారెడ్డి, భూషణ్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భూపతిరెడ్డి, హేమంత్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రవి, లింబారెడ్డి, సతీశ్‌రెడ్డి, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలి

నిజామాబాద్ రూరల్: భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని శబ్ద తరంగిణి అధ్యక్షుడు సేర్ల దయానంద్ అన్నారు. నగరంలోని పద్మశాలి సంఘం నగర గౌరవ అధ్యక్షుడు దీకొండ యాదగిరికి భగవద్గీతను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మురళి, హన్మాండ్లు పాల్గొన్నారు.